క్లుప్తంగా

ఆలయాలకు టీటీడీ నిధులు కేటాయించాలి



కామారెడ్డి అర్బన్: జిల్లాలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధులు మంజూరు చేయాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు రంజిత్‌మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును తిరుపతిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈమేరకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. టీటీడీ చైర్మన్‌ను కలిసిన వారిలో వీహెచ్‌పీ కామారెడ్డి నగర అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి, వీహెచ్‌పీ జిల్లా ప్రతినిధులు, ఆర్‌ఎస్‌ఎస్, స్వదేశీ జాగరణ్ మంచ్ నాయకులు రఘుపతిరెడ్డి, రాజాగౌడ్, నరేష్, వంగ రాహుల్‌కుమార్, సంతోష్‌కుమార్, నారాయణ, లక్ష్మిపతి ఉన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



రాజంపేట: గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి, అనంతరము సర్టిఫికెట్, ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ పప్పుల సుధాకర్ అన్నారు. ఆసక్తి గల మహిళలు రిజిస్ట్రేషన్ కోసం జిల్లా గ్రామ స్వరాజ్య సంస్థ కోఆర్డినేటర్ వెంకటలక్ష్మిని సంప్రదించాలని సూచించారు. మంగళవారం రాజంపేటలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో రఘురాం, సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, సతేంద్ర కుమార్, మాధవి పాల్గొన్నారు.

రాజ్యాంగం రక్షణకు కృషి చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి పౌరుడు రాజ్యాంగ రక్షణ కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసమే గ్రామాలలో 'జైబాపు–జైభీం–జైసంవిధాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు మద్దిమహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గైని శివాజీ, షౌకత్‌అలీ, రాజేందర్, మేకలరాజు, సంజీవులు, రాంచంద్రం, అఖిల్‌రావు, నారాయణరెడ్డి, సునిత పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని కన్నారెడ్డి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో తాగునీటి సరఫరా ప్రక్రియ, పారిశుధ్య పనుల నిర్వాహణ తీరును, అంగన్‌వాడీ, పాఠశాలను పరిశీలించారు. గ్రామంలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను ఆదేశించారు.

శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి



భిక్కనూరు: విద్యార్థులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ సూచించారు. తెయూ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం విద్యార్థులకు మృదునైపుణ్యాలు, కృత్రిమ మేధపై పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ శిక్షణను వినియోగించుకొని ఉద్యోగాలను పొందడానికి తగిన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని అన్నారు. నాణ్యత కలిగిన శిక్షణ అందించాలని ఎన్జీవో ప్రతినిధులకు సూచించారు. అధ్యాపకులు మోహన్ బాబు, అంజయ్య, హరిత, సబిత, లలిత, ప్రతిజ్ఞ, సృజన్, సుప్రీతా, బాలకృష్ణ పాల్గొన్నారు.

వేతనాలు రాకుండా పనిచేసేదెలా?

- నాలుగు నెలలుగా జీతాలు లేక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఇబ్బందులు
- కుటుంబ పోషణ భారమవుతోందని ఆవేదన



రాజంపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రాజంపేట: మండలంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు రాకుంటే పని ఎట్లా చేయాలని అధికారులను నిలదీస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 10 మంది మేట్లు ఉన్నారు. వీరు వచ్చిన ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కూలీలకు పని కల్పించి పనిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలి. అలాంటి ఉపాధి హామీ సిబ్బందికి నాలుగు నెలల నుంచి జీతాలు రాక పని ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ కూలీకి వందరోజుల పని కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వేతనాలు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీతాలు రాక తమ చేతిలో చిల్లి గవ్వ లేక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

సకాలంలో అందించాలి..



వేతనాలు అందక నాలుగు నెలలు అవుతుంది. దీంతో మేము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చాలిచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్నాం. పనిభారం కూడా పెరిగింది. అయినా అన్నిటికీ ఓర్చుకుని పనిచేస్తున్నాం. కానీ వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి వేతనాలు సకాలంలో అందించేలా చూడాలి.

– ఎర్ర గోపిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల ప్రెసిడెంట్

నిధుల విడుదలలో జాప్యం



ఫీల్డ్ అసిస్టెంట్లకు గత కొన్ని నెలలుగా వేతనాలు అందకపోవడం వాస్తవమే. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులు మొత్తం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కిందకు వస్తాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల విడుదల జాప్యంతోనే ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు అందడం లేదు. ఈ విషయాన్ని జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– రఘురాం, ఎంపీడీవో, రాజంపేట

ప్రమాదకరంగా ముళ్ల పొదలు

- ఢీకొని గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బిచ్కుంద-కందర్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లు

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద–కందర్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లు ప్రమాదకరంగా మారాయి. రాత్రిపూట చాలా మంది వాహనదారులు ముళ్ల చెట్లను గమనించకుండా వాటికి ఢీకొని గాయాలపాలవుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. పది రోజుల క్రితం దెగ్లూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి భార్యతో కలిసి బైక్‌పై బిచ్కుందకు వచ్చి, తిరిగి దెగ్లూర్ బయలుదేరాడు. మార్గమధ్యలో వారికి రెండు మూడు వాహనాలు ఎదురుగా రావడంతో లైట్ల వెలుతురుకు ఏమీ కనిపించకపోవడంతో ముళ్ల చెట్లను ఢీకొన్నారు. దీంతో బైక్ నడిపిన వ్యక్తికి ముళ్లు కంటిలోకి కుచ్చుకుపోయాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా ముళ్లు కుచ్చుకున్న ఒక కన్ను పోయిందని వైద్యులు పేర్కొన్నట్లు బాధితుడి బంధువులు తెలిపారు. అలాగే నెల రోజుల క్రితం హసెగాంకు చెందిన ఓ వ్యక్తి కళ్లలోకి కూడా ముళ్లు కుచ్చుకుపోయాయి. ఇలా చాలా మంది ముళ్ల చెట్లతో ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యపై ప్రజలు ఆర్‌అండ్‌బీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. కానీ చెట్లను తొలగించడానికి నిధులు లేవని అధికారులు చేతులు ఎత్తివేయడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఫైర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా సీహెచ్ రాజయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన హుస్నాబాద్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం

కామారెడ్డి టౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఎమ్మెల్సీ అమీర్ ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లిమ్రా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆయన ముస్లింలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సవరణ బిల్లుతో ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు జావేద్, బాబా, ముస్లీంలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మద్నూర్‌లో ఫైర్ విన్యాసాలు చేస్తున్న సిబ్బంది



ఎల్లారెడ్డిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మద్నూర్(జుక్కల్): వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించేందుకు ఎక్కువ అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ సిబ్బంది సూచించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని అగ్ని ప్రమాదాలపై సిబ్బంది అవగహన కల్పించారు. ముందు జాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. అనంతరం అగ్నిమాపక శకటం పనితీరును, మంటలను ఆర్పివేసే విధానాన్ని సిబ్బంది ప్రదర్శించారు. ఫైర్ ఆఫీసర్ రాజయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ నర్సింలు, గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణంలోని బస్టాండ్‌లో మంగళవారం ప్రయాణికులకు అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వినోద్, సిబ్బంది తదితరులున్నారు.

బీబీపేటలో రేపు వైద్య శిబిరం



బీబీపేట: మండల కేంద్రంలోని వాసవి క్లబ్ భవనంలో గురువారం ఆర్‌వీఎం హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాసవి క్లబ్, వీటీ ఠాకూర్ మెమోరియల్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం వైద్య శిబిరం కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎండ్రియాల్, కృష్ణాజీవాడి గ్రామాలలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి రాజారాం పర్యటించి, ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. కృష్ణాజీవాడిలో రేషన్‌కార్డు లబ్ధిదారుల సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో నీటిసమస్యలు తలెత్తకుండా చూడాలని గ్రామకార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ బీసీ కమిటీని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా మూగ సాయిలు, ఉపాధ్యక్షుడిగా నర్వ వినోద్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్, కార్యదర్శులుగా విటూరి శశాంత్, మంగళి బాలకిషన్, సభ్యులుగా కుమ్మరి సాయిలును ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల నాయకులు జొన్నల రాజు, ప్రసాద్‌గౌడ్, రఫియోద్దీన్, సాయిలు, నగేష్, అఫ్రోజ్, ఎల్లమయ్య, కొడరవి, ఏదుల్, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన నాయీబ్రాహ్మణులు



కామారెడ్డి టౌన్: పట్టణంలో నూతనంగా ఏర్పడిన నాయీ బ్రాహ్మణ కమిటీ సభ్యులు మంగళవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను మంగళవారం ఆమె నివాసంలో కలిశారు. నాయీ బ్రాహ్మణుల సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆమెను కోరారు. కమిటీ అధ్యక్షుడు జొన్నల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జొన్నల వేణు, సాయికుమార్, కోశాధికారి కడెం దేవరాజ్, ప్రధాన కార్యదర్శి దుబ్బాక మురళి, సలహాదారులు సుదర్శన్, రామస్వామి, మల్లికార్జున్, సంగమేశ్వర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చిన్న తక్కడ్‌పల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ అన్నారు. మండలంలోని చిన్నతక్కడ్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీఎం ధూప్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్, బన్సీ, మహిళాసంఘ సభ్యులు పాల్గొన్నారు.

భిక్కనూరు మండలంలో..

భిక్కనూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్ద మల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు రాజాగౌడ్ అన్నారు. మండలంలోని ఇస్సన్నపల్లి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రతి రైతు ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు విఠల్, నాయకులు తిరుమల స్వామి, యాదగౌడ్, యాదగిరి, రాములు, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా రోజు నీరు పట్టాలి



ముత్యంపేటలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు



బీబీపేటలో..



మీసాన్‌పల్లిలో..

దోమకొండ: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ముత్యంపేట, చింతమాన్‌పల్లి గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోని ఎండల నుంచి మొక్కలను కాపాడాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యదర్శులు రమేష్, అంజయ్య తదితరులు ఉన్నారు.

బీబీపేట: నర్సరీలోని మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని సందర్శించారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, కార్యదర్శి వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: నర్సరీలలో మొక్కలు ఎండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. మీసాన్‌పల్లి గ్రామంలో నర్సరీ, కంపోస్టుషెడ్, స్మశాన వాటిక, ప్రకృతి వనంను మంగళవారం ఆయన పరిశీలించారు.

పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్ గ్రామం పల్లె ప్రకృతి వనం, నర్సరీలను మంగళవారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ రాము, ఎంపీవో కమలాకర్ పరిశీలించారు. ఎంపీవో మాట్లాడుతూ.. నర్సరీలలోని మొక్కలు ఎండకుండా ప్రతిరోజు నీరు పట్టించాలని సూచించారు. కార్యదర్శి భాస్కర్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

తల్లిదండ్రులను మించిన దైవం లేదు



నిజాంసాగర్(జుక్కల్): తల్లిదండ్రులను మించిన దైవం మరొక్కటి లేదని తొగుట పీఠాధీశులు మాదావనంద సరస్వతి స్వామి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి క్షేత్రంలో మంగళవారం శతరుద్ర పారాయణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి స్వామిజీ హాజరై, ప్రవచనాలు చేశారు. దైవ కార్యక్రమాల్లో యువత ముందుండాలని సూచించారు. అంజనాద్రి ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిషోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సీతారామస్వామి నవరాత్రి ఉత్సవాల్లో కృష్ణానంద స్వామి చేస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా కృష్ణానంద స్వామిని ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు అభినందించారు. అర్చకులు శశికాంత్‌శర్మ, సుదర్శన్, జగన్నాథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా నల్ల పోచమ్మ బోనాల పండుగ



బాన్సువాడ: పట్టణంలోని బేతాళ స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. కొత్త బాన్సువాడలోని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకుని, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా నల్ల పోచమ్మ ఆలయానికి వచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆయా కుల సంఘాల పెద్దలు ఉప్పరి లింగం, జంగం గంగాధర్, గంట్యాల బాలకృష్ణ, శ్రీనివాస్, పత్తి శ్రీకాంత్, కాసుల రోహిత్, కటికె రమేష్, ఆనంద్, కిషన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బొరడి పోచమ్మ పండుగ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్తులు బొరడి పోచమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళాలు పెద్దఎత్తున బోనాలు తీసి, గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

19 నుంచి రామ్‌లల్లా రామ్‌దారి అఖడా శిక్షణ శిబిరం

కామారెడ్డి అర్బన్: రామ్‌లల్లా రామ్‌దారి అఖడా ఆధ్వర్యంలో ఈనెల 19నుంచి 24వరకు హైదరాబాద్ శామీర్‌పేట్‌లో ఆధ్యాత్మిక శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు రామ్‌లల్లా కామారెడ్డి అఖడా పీఠాధిపతి వేదయోగి మహారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఆచార్యులు మల్లంపల్లి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని, 20 నుంచి 50ఏళ్ల లోపు వయసు ఉన్నవారు శిక్షణకు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 90302 50679, 94933 72246 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సంక్షిప్తం

క్రైస్తవుల శాంతిర్యాలీ



భిక్కనూరు: మండల కేంద్రంలో మంగళవారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు చర్చి ఫాదర్లు మాట్లాడుతూ.. ఏపీలో పాస్టర్ ప్రవీణ్ హత్యకు కారకులైన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవం సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మద్దికుంట కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడి సస్పెన్షన్

రామారెడ్డి: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ ఆదేశం మేరకు కాంగ్రెస్ పార్టీ మద్దికుంట యూత్ అధ్యక్షుడు బొమ్మిడి రఘుపతిని పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్టు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ మంగళవారం తెలిపారు. పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, కాంగ్రెస్ పార్టీ విధానానికి వ్యతిరేకంగా పనిచేయడంతోనే అతడిని సస్పెన్షన్ చేయాల్సి వచ్చిందని నర్సాగౌడ్ తెలిపారు.

సన్మానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంగోజివాడి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ ఎల్లారెడ్డి నియోజకవర్గం అధ్యక్షుడు గైని శివాజీని గ్రామస్తులు సన్మానించారు. లింగం, ప్రశాంత్, రాములు, హమీద్, ఖయ్యూం, మురళీ, బాలురాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడివిలింగాల గేట్ వద్ద చలివేంద్రాన్ని మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్రాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, చర్చి సిస్టర్ లీనా హెప్సీబా, శ్రీనివాసచారి తదితరులున్నారు.

పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌పై జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సాయిబాబా, లింగమయ్య, సతీష్ తదితరులున్నారు.